సంపుటి :02 సంచిక :245 పేజీలు :06
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
శుక్రవారం 06, నవంబర్ 2025

## ఏసీబీ వలలో అడిషనల్ కలెక్టర్

- మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా..
- రూ.60 వేల లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్
- ఓ ప్రైవేట్ స్కూలు రెన్యువల్ కోసం లంచం డిమాండ్

05





## విందులు.. నజరానాలు

- గ్రామాల్లో వేడెక్కిస్తున్న ప్రలోభ రాజకీయాలు
- బతుకు దెరువుకు వలసెళ్లిన వారికి ఫోన్‌కాల్స్
- స్వస్థలాలకు వచ్చేందుకు రవాణా ఖర్చులు అందిస్తామని హామీ
- ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు డిన్నర్లు
- రాత్రిళ్లు రహస్య సమావేశాలు.. వాట్సాప్ గ్రూప్‌ల్లో అభ్యర్థనలు, విజ్ఞప్తులు

04

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. గ్రామాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు విందు రాజకీయాలకు తెరలేపారు. రోజువారీగా తమ మద్దతు దారులకు, ఓటర్లకు విందులు ఏర్పాటు చేస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు. రాత్రిపూట రహస్య సమావేశాలు జోరందుకున్నాయి. ఈ సమావేశాలలో కుల సంఘాల నాయకులను అభ్యర్థులు మంతనాలు జరిపి, గంపగుత్తగా ఓట్లు వేసేలా భారీగా నజరానాలు అందజేస్తున్నారు. పట్టణాల్లో బతుకు దెరువు కోసం నివాసం ఉంటున్న ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సొంత వాహనాల్లో వారిని స్వగ్రామానికి రప్పించడానికి మంతనాలు సాగిస్తున్నారు. గ్రామాభివృద్ధిని కోరుకునే వారికంటే, తమకు డబ్బులు, ఇతర ప్రయోజనాలు అందించేవారికే ఓటు వేయాలనే ధోరణి పెరుగుతుండడం పల్లె రాజకీయాలను పతాకస్థాయికి చేర్చింది.

– అక్షర దర్బార్, ప్రధానప్రతినిధి

### మార్చి 31 లోపు

# మామునూరు ఎయిర్ పోర్టు

### పనులు ప్రారంభిస్తాం

- అలాగే ఓఆర్ఆర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు కూడా మొదలు పెడతాం
- నర్సంపేట నియోజకవర్గానికి మరో 3,500 ఇండ్లు ఇస్తాం
- వాటిపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి పర్యవేక్షణ
- హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధి
- మంచోళ్లను సర్పంచ్‌గా ఎన్నుకోండి
- నర్సంపేట ప్రజాపాలన ఉత్సవాల్లో సీఎం రేవంత్‌రెడ్డి హామీలు
- సభ సక్సెస్‌తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

**అభివృద్ధిపై హామీ**

గత బీఆర్ ఎస్ ప్రభుత్వం ఎయిర్ పోర్టును పట్టించుకోలేదని విమర్శిస్తూ, వరంగల్‌ను హైదరాబాద్ లా తీర్చిదిద్దుతామన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లు**

నర్సంపేట నియోజకవర్గానికి అదనంగా మరో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే బాధ్యతను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అప్పగిస్తున్నామని తెలిపారు.

**రైతు సంక్షేమం**

సన్న వడ్లకు గిట్టుబాటు ధరతో పాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని, తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు రైతు భరోసా అందించామని గుర్తు చేశారు.

**ఉద్యోగాలు**

మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, మరో 40 వేల ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్లు ఇస్తామని ప్రకటించారు.

**సంక్షేమ పథకాలు**

కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని, 3 కోట్ల 10 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని వివరించారు.



వరంగల్ మెగా ప్లాన్ రెడీ! సిటీ పరిధిలో వచ్చే ఏడాది మార్చి 31 లోపే ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మొదలు పెడతాం... నర్సంపేటకు మరో 3,500 ఇళ్లు మంజూరు చేస్తాం... రూ. 508 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన! శుక్రవారం నర్సంపేటలో జరిగిన ప్రజాపాలన విజయోత్సవంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి హామీల వర్షం కురిపించారు. బీఆర్ఎస్ పాలనపై నిప్పులు చెరుగుతూనే, అభివృద్ధిలో వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఇందిరమ్మ చీరలు, సన్నబియ్యం పంపిణీపై ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపాయి.

02

– అక్షర దర్బార్ , నర్సంపేట

## గంటకు 100... రెండు గంటలకు 200

గ్రామాల్లో ప్రచార కూలీలకు పెద్ద గిరాకీ...

- అదనంగా 'అలవాలు' కూడా

03



## రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు

నాలుగు రోజుల్లో రూ.600 కోట్ల విలువైన లిక్కర్ సేల్

పంచాయతీ ఎన్నికల ప్రభావం

04










# మార్చి 31 ఆ లోపు

## మామునూరు ఎయిర్ పోర్ట్

# పనులు ప్రారంభం

**ఓఆర్ఆర్, అండర్ గ్రౌండ్ డ్రేనేజీ పనులు కూడా..**

- నర్సంపేట నియోజక వర్గానికి మరో 3,500 ఇండ్లు ఇస్తాం
- వాటిపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి పర్యవేక్షణ
- హైదరాబాద్ కు దీటుగా వరంగల్ అభివృద్ధి
- మంచోళ్లను సర్పంచ్ గా ఎన్నుకోండి
- నర్సంపేట ప్రజాపాలన ఉత్సవాల్లో సీఎం రేవంత్ రెడ్డి హామీలు
- సభ సక్సెస్ తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్

అక్షరదర్బార్, నర్సంపేట: వచ్చే ఏడాది మార్చి 31 లోగా వరంగల్ ఎయిర్ పోర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు పనులు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. వరంగల్ ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆయన వరంగల్ జిల్లా నర్సంపేటలో పర్యటించారు. తొలుత రూ.508 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ కు గురించి పట్టించుకో లేదని మండిపడ్డారు. హైదరాబాద్ లా వరంగల్ కు ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్ పోర్టు నిర్మిస్తామని ప్రకటించారు. నర్సంపేట నియోజకవర్గంకు అదనంగా మరో మూడు వేల నుంచి 3500 ఇండ్లు మంజూరు చేసే బాధ్యత మంత్రి పొంగులేటికి అప్పగిస్తు న్నామని తెలిపారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ నాయకులు తమ ఆస్తులు పెంచుకున్నారు తప్ప నర్సంపేట నియోజకవ ర్గాన్ని అభివృద్ధి చేయలేదని ఆయన విమర్శించారు. రైతుల విషయంలో తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. వరి వేసుకుంటే ఉరి అని ఆనాటి ముఖ్యమంత్రి హెచ్చరించిన పరిస్థితి ఉండేదని, కానీ ఈనాడు సన్న వడ్లు పండిస్తే గిట్టుబాటు ధరతో పాటు రూ. 500 బోనస్ అందిస్తున్నామని ఆయన తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు రైతు భరోసా అందించామని ఆయన గుర్తు చేశారు. 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ. 20 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదేనని ఆయన వెల్లడించారు. దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని ఆయన అన్నారు. పేదల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇవ్వాలంటే వాళ్ల ఆస్తులు రాసిచ్చినట్లు మాట్లాడా రని ఆయన విమర్శించారు. కానీ ప్రజా ప్రభుత్వంలో లబ్ధి దారులకు కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మంది బిడ్డలకు సన్నబియ్యం అందిస్తున్నామని ఆయన అన్నారు. ఏడాదికి రూ. 13 వేల కోట్లు భారమైనా పేదవాడి ఆకలి తీర్చాలని సన్నబియ్యం అందిస్తున్నామని ఆయన వెల్లడించారు. సంక్షేమ పథకాలు పేదలకు అందాలన్నదే తమ ప్రయత్న మని ఆయన తెలిపారు.

### - ఎందరో మహానుభావులు

వరంగల్ జిల్లాలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా చరిత్రను స్మరించుకుంటూనే, అభివృద్ధిపై కీలక ప్రక టనలు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎప్పుడు వచ్చినా కాకతీయులు, సమ్మక్క సారక్క, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తి కనిపిస్తుందని ఆయన అన్నారు. గృహనిర్మాణ పథకంపై ముఖ్యమంత్రి కీలక విషయాలు వెల్లడించారు. 2004 నుంచి 2014 వరకు వైఎస్ హయాంలో పదేళ్లలో 25 లక్షల ఇందిరమ్మ ఇండ్లు కట్టించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ప్రస్తుతం రూ. 22,500 కోట్లతో ప్రతీ నియోజక వర్గంలో 3500 ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తున్నామని ఆయన తెలిపారు. నర్సంపేటకు మరో 3500 ఇండ్లు మంజూరు చేసే బాధ్యత మంత్రి పొంగులేటికి అప్పగిస్తున్నామని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తామని సీఎం ప్రకటించారు. దేశంలో గొప్ప గొప్ప యూనివర్సిటీలను ఏర్పాటు చేసిన ఘనత జవహర్ లాల్ నెహ్రూదని ఆయన అన్నారు. హైదరాబాద్ నగరంలా వరంగల్‌ను తీర్చిదిద్దుతామని ఆయన వెల్లడించారు. హైద రాబాద్‌లా వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎయిర్ పోర్టు నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## రూ.508 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలుత నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, మంత్రులు ఇతర ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో కలిసి సుమారు రూ.*508* కోట్ల వ్యయంతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. వీటిలో రూ. *56.40* కోట్ల వ్యయంతో నర్సంపేట నుండి నెక్కొండ హెచ్ఎం రోడ్డు *2*ఎల్ +పీఎస్ / *4*ఎల్ లైన్లకు శంకుస్థాపన, రూ. *82.56* కోట్లతో హనుమకొండ నర్సంపేట మహబూబాబాద్ హెచ్ఎం రోడ్డు నాలుగు లైన్లకు శంకుస్థాపన, నర్సంపేటలో రూ. *260* కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు శంకుస్థాపన, రూ.*130* కోట్ల వ్యయంతో ప్రభుత్వ వైద్య కళాశాల, వసతి గృహముల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.*200* కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు శంకుస్థాపన, నర్సంపేట పట్టణంలో రూ. *20.00*కోట్లతో అంతర్గత సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, బీటీ రోడ్లు మరియు సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.*17.28* కోట్ల వ్యయంతో నర్సంపేట నుంచి పాకాల హెచ్ఏఎం రోడ్డు *2*ఎల్ +పీఎస్ లైన్లకు శంకుస్థాపన వంటి కార్యక్రమాలున్నాయి. సభ సక్సెస్ తో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ కనబడింది.



మార్చి 31 లోగా వరంగల్ ఎయిర్ పోర్టు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఔటర్ రింగ్ రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. కమ్యూనికేషన్ ఇన్ పోర్ట్స్, కమ్యూనికేషన్ ఇన్ టెక్నాలజీ అని తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వ హించబోతున్నామని ఆయన వివరించారు. మహిళా సాధి కారతకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని ప్రభుత్వం సంకల్పం తీసుకుందని ఆయన అన్నారు. అందుకే అన్ని రంగాల్లో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందే కార్యక్రమాలు చేపట్టామని ఆయన వివరించారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో పాటు మహిళ లను బస్సులకు యజమానులను చేశామని ఆయన తెలిపారు. పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్లు నిర్వ హించుకునేలా ప్రోత్సహించామని ఆయన వెల్లడించారు.

### - కోటిమంది మహిళలకు చీరెలు

మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కోటి మంది ఆడబిడ్డలకు కోటి చీరలు పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. 18 ఏండ్లు నిండిన ప్రతీ ఆడబిడ్డకు చీర చేరాల్సిందేనని, ఏ ఆడబిడ్డ తనకు చీర రాలేదు అనే మాట రావద్దని ఆయన అన్నారు. అందరికీ చీరలు చేరేలా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాల భర్తీపై సీఎం ప్రకటన చేశారు. చదు వొక్కటే మన జీవితంలో మార్పు తీసుకొస్తుందని ఆయన అన్నారు. అందుకే మీ పిల్లలను చదివించాలని, మీ పిల్లల చదువుకు కావాల్సిన వసతులు అందించే బాధ్యత తమదని ఆయన తెలిపారు. మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన వెల్లడించారు. మరో 40 వేల ఉద్యో గాల భర్తీకి త్వరలోనే నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నిరుద్యోగ యువత బాగా చదువు కుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన సూచిం చారు. చివరగా, గ్రామాల్లో రాజకీయ కక్షలకు తావు ఇవ్వొ ద్దని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఎన్నికల్లో డబ్బులు ఖర్చు చేయకండి, ప్రజల మనసులు గెలుచుకోండని ఆయన హిత వు పలికారు. గ్రామ సమస్యలపై అవగాహన పెంచుకుని అభివృద్ధి చేసుకోవాలని ఆయన కోరారు. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను ప్రజలు బండకేసి కొట్టినా వాళ్లకు బుద్ధి రాలేదని ఆయన విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి పని చేసుకునే వాళ్ళనే మంచి సర్పంచులుగా ఎన్నుకో వాలని ఆయన సూచించారు. మీరు అండగా ఉంటే ఢిల్లీనైనా ఢీకొడతామని ముఖ్యమంత్రి అన్నారు.

# కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి**



అక్షర దర్బార్ శాయంపేట: కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని అభివృద్ధి చేసి చూపిస్తామని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి గారు కోరారు. శుక్రవారం శాయంపేట మండలం మైలారం గ్రామంలో కాంగ్రెస్ బల పరిచిన అభ్యర్థి తో పెద్దకోడపాక కేంద్రంలో నామినేషన్ వేయించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి గారు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులను ఆశీర్వదిస్తే ప్రజా ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారి సహకారంతో అధిక నిధులు తీసుకువచ్చి ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని అన్నారు. నిజాయితీ నిబద్దతతో పనిచేసి, అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలలో కూడా మండలానికి అధిక ప్రాధాన్యత నిచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చల్లా చక్రపాణి,మామిడిపల్లి సాంబయ్య,డిటి రెడ్డి,అరికెళ్ల సుధాకర్,ఏనుగుల శిరీష, అశోక్ కుమారస్వామి రవీందర్ సదయ్య రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక సహాయం అందజేత



అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన పద్మశాలి పరపతి సంఘం సభ్యులు గుండా బాబురావు అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న సంఘం సభ్యులు మృతిని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. అనంతరం సంఘం తరపున రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కందగట్ల పరమాత్మ,మాజీ అధ్యక్షులు కందగట్ల ప్రకాశం, ప్రవీణ్ కుమార్, తిరుపతి, గుర్రం రమేష్, కందగట్ల రాజమొగిలి, సూర్యనారాయణ, బంక ప్రవీణ్, కందగట్ల హరికృష్ణ, నరహరి, శ్రీధర్, వెంకటేష్, కుసుమ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి

**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**



అక్షర దర్బార్ సంగెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఆరు గ్యారెంటీల అమలుపై నిలదీయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రజలకుపిలుపునిచ్చారు. శుక్రవారం సంగెం మండలం గుంటూరుపల్లి గ్రామంలో పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటుచేసిన మండల సన్నాహక సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల వారిగా గ్రామాలలో ప్రస్తుత పరిస్థితులను కార్యకర్తలను అడిగి తెలుసుకొనిచర్చించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సత్తా చాటాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీయాలన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఏకతాటిపై ఉండి సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు,మండల బిఆర్ఎస్ నాయకులు,మాజీ జడ్పీటీసీ గూడా సుదర్శన్ రెడ్డి, పసునూరి సారంగపాణి, దోపతి సమ్మయ్య, అప్పే నాగార్జున శర్మ కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గంటకు రూ.100.. రెండు గంటలకు రూ.200



**- గ్రామాల్లో ప్రచార కూలీలకు భలే గిరాకీ..**

అక్షరదర్బార్, పరకాల: పరకాల నియోజకవర్గంలోని గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల వేడి పెరిగింది. గ్రామాలు అంతా ప్రచార నినాదాలతో మార్మోగుతుంటే.. ప్రచార కూలీలకైతే ఈ సీజన్ నిజంగా డబ్బు వర్షమే అయ్యింది. సర్పంచ్ అభ్యర్థులు, పార్టీల స్థానిక నాయకులు ఇంటింటికీ ప్రచారం చేయించేందుకు వాడవాడలా మనుషుల కోసం తెగ వెతుకుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రచార కూలీల రేట్లు గంట గంటకూ పెరుగుతున్నాయి. నడికూడ మండలంలో శుక్రవారం జరిగిన ప్రచారంలో పాల్గొన్న మహిళలకు గంటకు రూ.100 చొప్పున, పురుషులకు రూ.200తో పాటు మందు కూడా ఇచ్చినట్లు స్థానికంగా ప్రచారం సాగుతోంది. ఉదయం ఒక గంట ప్రచారానికి వెళ్లి.. ఆ తర్వాత తమ దైనందిన పనుల్లో పడుతున్న మహిళలు, యువకులు ఈ కాలాన్ని గ్రామాల్లో పండుగలా భావిస్తున్నారు. “ఒక గంట ఒక పార్టీ.. మరో గంట ఇంకో పార్టీ.. ఇలా మూడు పువ్వులు ఆరు కాయలు లాగా వెళ్లిపోతున్నాం,” అని కార్యకర్తలు నవ్వుకుంటూ చెబుతున్నారు. రోజుకు మూడు నాలుగు గంటలు తిరిగితే రూ.300 నుండి రూ.500 వరకూ జేబులో పడుతోందని వాళ్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎన్నికల సమయం వచ్చినప్పుడల్లా గ్రామాల్లో ఇలాగే ప్రచార కూలీలకు పెద్ద డిమాండ్ ఏర్పడుతుండటం ప్రత్యేకతగా మారిపోయింది.

# ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్

**- సైబర్ నేరాలపై అవగాహన అవసరం : సీఐ మల్లేష్**




అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి : సైబర్ నేరాల నివారణ కోసం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు శుక్రవారం మొగుళ్ళపల్లి మండలం లోని అమ్మ గార్డెన్ లో చిట్యాల సిఐ మల్లేష్ ఆధ్వర్యంలో మొగుల్ల పల్లి ఎస్సై బి అశోక్ తో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంపు లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో “ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో 42 రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రజలు ఫ్రాడ్ కాల్స్ పట్ల జాగ్రత్త గా ఉండాలి అని స్టాక్ మార్కెట్లో పెట్టుబడి తక్కువ సమయంలో ఎక్కువ లాభం లాంటి మోసపూరిత పెట్టుబడి గురించి, డిజిటల్ అరెస్ట్ వంటి బయపెట్టే మరియు మభ్యపెట్టే విధంగా వచ్చే అపరిచిత కాల్స్ పట్ల జాగ్రత్త వహించాలి అని తెలిపారు అంతేకాకుండా స్థానిక సంస్థల ఎన్నికలలో ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు సోషల్ మీడియాలో వాట్సాప్ లో చేయవద్దని ఒకవేళ చేస్తే ఆ గ్రూప్ యొక్క అడ్మిన్ ను బాధ్యులుగా చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 కు కాల్ చేయాలని, అలాగే NCRP www.cybercrime.gov.in 5 సంబంధిత పోలీస్ అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారని తెలిపారు ఇట్టి కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది శ్రీనివాస్ ప్రభాకర్ కృష్ణ నవీన్ శంకర్ అజయ్ పాల్గొన్నారు

# మహాఘటాభిషేకం కరపత్రం ఆవిష్కరణ



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా కేంద్రంలో మార్గశిర ఆర్ద్ర నక్షత్ర మహాఘటాభిషేకానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ములుగు నాగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అధ్యక్షుడు గందె శ్రీను ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈనెల 7వ తేదీ ఆదివారం నాగేశ్వర స్వామి ఆలయంలో ఘనంగా మహాఘటాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. జిల్లాలోని శివభక్తులు అధిక సంఖ్యలో హాజరై శుభకార్యాన్ని విజయవంతం చేయాలని కమిటీ కోరింది. దంపతులు తమ ఇళ్లలో కలశాలను అలంకరించుకుని పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సిరికొండ బలరాం, ప్రధాన కార్యదర్శి గాదం కుమార్, కోశాధికారి గంగిశెట్టి శ్రీనివాస్, సలహాదారులు గొల్లపల్లి రాజేందర్, ఉపాధ్యక్షులు ఎల్లావుల అశోక్, వాంకుడోత్ జ్యోతి, తుమ్మ అమర్నాథ్, కార్యదర్శులు కొమరవెల్లి సతీష్, వలపదాసు మమత, కార్యవర్గ సభ్యులు అడ్డగూరి మహేందర్, సూర కిషన్, పులి ప్రకాశ్, గంధం మహేందర్, తడుక సుధాకర్, ఆడెపు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మద్దతే బలం గ్రామ శ్రేయసే లక్ష్యం

**సర్పంచ్ రేసులో ముందంజలో..**

**వెంకటేశ్వర్ల పల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మహేందర్ రెడ్డి**



అక్షర దర్బార్, పరకాల: నడికూడ మండలం వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలో సర్పంచ్ పోటీలో పెండ్యాల మహేందర్ రెడ్డి ముందంజలో ఉన్నారని స్థానిక రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. డిసెంబర్ 11న జరగనున్న మొదటి విడత ఎన్నికల్లో గ్రామ ప్రజల ఆశీస్సులు, అపారమైన మద్దతు తనవైపు వున్నాయని ఆయన నమ్మకంగా తెలిపారు. గ్రామ అభివృద్దే ప్రధాన ధ్యేయమని చెప్పిన మహేందర్ రెడ్డి, గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా గ్రామానికి సబ్‌స్టేషన్, లిఫ్ట్ ఇరిగేషన్, ప్రతి కులానికి సంఘ భవనాలు, అంతర్గత సీసీ రోడ్లు, కొత్త గ్రామ పంచాయతీ భవనం ఏర్పాటుకు తాను కృషి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం గ్రామంలో అత్యంత భాధాకరంగా మారిన కోతుల బెడదను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామానికి బస్సు సౌకర్యంతో పాటు గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, గ్రామాన్ని ఒక ఆదర్శ గ్రామంగా నిలపాలన్న సంకల్పంతో ప్రజలందరి సహకారంతో ముందుకు సాగుతానని తెలిపారు. “ప్రజలు నాపై విశ్వాసం ఉంచుతున్నారు. వారి ఆశీస్సులతో సర్పంచ్‌గా నా సేవలను అంకితం చేస్తాను. అభివృద్ధిలో నా ముద్రను చూపించడం నా బాధ్యతగా భావిస్తున్నాను” అని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు.



# సర్పంచ్ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించాలి

### కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోరుతూ ఎమ్మెల్యే రేవూరి ప్రచారం

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఆరుకల అంజిరెడ్డి, వార్డు సభ్యుల గెలుపు కోసం శుక్రవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, కాంగ్రెస్ అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. ప్రజలే పాలకులని భావించే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం–అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఉచిత బస్సు, 500 రూపాయలకే గ్యాస్, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, రెండు లక్షల రుణమాఫీ, వరికి బోనస్, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్ వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థించాలని సూచించారు. గెలిచిన వారికి గ్రామాభివృద్ధి నిధులు సమృద్ధిగా అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు.




# ముందస్తు అరెస్టు

అక్షర దర్బార్ శాయంపేట : నర్సంపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో భాగంగా మాందరిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన కాదు రాక్షస పాలన నడుస్తుందని బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి యువజన నాయకులను అరెస్టులు చేయడం సరైనది కాదని అన్నారు.

# సైబర్ క్రైంపై అవగాహన సదస్సు

### పరకాల సీఐ క్రాంతికుమార్




అక్షర దర్బార్, పరకాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పరకాల సిఐ వి. క్రాంతి కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని, ఇంట్లో ఉన్న పెద్దలకు కూడా ఈ విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పేటీఎం, ఓఎల్ఎక్స్ మోసాలు, ఓటీపీ – కేవైసీ ఫ్రాడ్స్, ఫిషింగ్ మెయిల్స్, హ్యాకింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు వివరణ ఇచ్చారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సిఐ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే. సంపత్ కుమార్, పరకాల ఎస్ఐ పవన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.డి. సర్దార్, స్టూడెంట్ కౌన్సిలర్ పద్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రిటైర్డ్ ఉద్యోగుల ఉసురు తీస్తున్న ప్రభుత్వం

### ఎమ్మెల్సీకి ఆర్ఈడబ్ల్యూఏ వినతి

# 20 నెలల బకాయిల కోసం 28 మంది ఆత్మహత్యలు!

అక్షర దర్బార్, మహబూబాబాద్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత 20 నెలలుగా రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు విడుదల చేయకపోవడం వల్లే ఇప్పటివరకు 28 మంది ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్ఈడబ్ల్యూఏ) ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్ఈడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రి నారాయణ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందరావు కు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగులు దాచుకున్న టీఎస్ జీఎల్ఐ , జీపీఎఫ్, లీవ్



ఎన్‌కాష్‌మెంట్ వంటి బకాయిలను కూడా ప్రభుత్వం ఇవ్వకుండా మానసిక ఒత్తిడికి గురిచేస్తోందని బద్రి నారాయణ మండిపడ్డారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ రవీందర్‌రావు, సమస్యను త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని, బకాయిలు ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుగులోత్ కిషన్ నాయక్, గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్, టి.మురళీధరస్వామి, యోగేశ్వరరావు , సుంకరి వెంకటేశ్వర్లు, నిరంజన్ రెడ్డి, ఇమామ్, కోలా దర్గయ్య, రమేష్ బాబు, ఎం.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



# రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు

- నాలుగు రోజుల్లో రూ.600 కోట్ల విలువైన లిక్కర్ సేల్
- పంచాయతీ ఎన్నికల ప్రభావం

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాష్ట్రంలో మద్యం అమ్మకాలు రికార్డు సృష్టిస్తున్నాయి. అమ్మకాలపై పంచాయతీ ఎన్నికల ప్రభావం స్పష్టంగా కనిపించింది. గడిచిన నాలుగు రోజుల్లో రూ. 600 కోట్లు విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే మద్యం అమ్మకాలు 107 శాతం పెరిగాయి. ఎక్సైజ్ శాఖ ఈ మేరకు శుక్రవారం గణాంకాలను వెల్లడించింది. చలికాలంలో కూడా బీర్ల అమ్మకాలు భారీగా ఉండటం గమనార్హం. సాధారణంగా వేసవిలో బీర్ల విక్రయాలు ఎక్కువగా ఉంటాయి. కానీ, చలి విపరీతంగా ఉన్నప్పటికీ అత్యధికంగా బీర్లు అమ్ముడయ్యాయి. ఈ నాలుగు రోజుల్లో 5.89 లక్షల కేసుల బీర్లు అమ్ముడయ్యాయట. గతేడాది ఇదే సమయంలో కేవలం 4.29 లక్షల కేసుల బీర్లు మాత్రమే విక్రయమయ్యాయి. ఈ విపరీతమైన అమ్మకాల పెరుగుదలకు కారణాలను ఎక్సైజ్ అధికారులు విశ్లేషిస్తున్నారు. కొత్త మద్యం పాలసీ అమలు, గ్రామాల్లో జరగనున్న సర్పంచ్ ఎన్నికల సందడి కారణంగా లిక్కర్ అమ్మకాలు భారీగా పెరిగాయని అధికారులు అంటున్నారు. గతంలో దసరా పండుగ సందర్భంగా కూడా మద్యం అమ్మకాలు రికార్డు సృష్టించాయి. ఆ



సమయంలో పండుగ, గాంధీ జయంతి ఒకే రోజు వచ్చినా రూ. 419 కోట్ల మద్యం అమ్ముడైంది. ఈ తాజా రికార్డు రాష్ట్రంలో పెరుగుతున్న వినియోగానికి అద్దం పడుతోంది.

# విందులు.. నజరానాలు

- గ్రామాల్లో వేడెక్కిస్తున్న ప్రలోభ రాజకీయాలు
- బతుకు దెరువుకు వలసెల్లిన వారికి ఫోన్‌కాల్స్
- స్వస్థలాలకు వచ్చేందుకు రవాణా ఖర్చులు అందిస్తామని హామీ
- ఓటర్ దేవుళ్లను ప్రసన్నం చేసుకునేందుకు డిన్నర్లు
- రాత్రిళ్లు రహస్య సమావేశాలు.. వాట్సాప్ గ్రూప్‌ల్లో అభ్యర్థనలు, విజ్ఞప్తులు



అక్షర దర్బార్, ప్రధానప్రతినిధి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల వేడి తారస్థాయికి చేరింది. గ్రామాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు విందు రాజకీయాలకు తెరలేపారు. రోజువారీగా తమ మద్దతుదారులకు, ఓటర్లకు విందులు ఏర్పాటు చేస్తూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు. రాత్రిపూట రహస్య సమావేశాలు జోరందుకున్నాయి. ఈ సమావేశాలలో కుల సంఘాల నాయకులను అభ్యర్థులు మంతనాలు జరిపి, గంపగుత్తగా ఓట్లు వేసేలా భారీగా నజరానాలు అందజేస్తున్నారు. పట్టణాల్లో బతుకు దెరువు కోసం నివాసం ఉంటున్న ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. సొంత వాహనాల్లో వారిని స్వగ్రామానికి రప్పించడానికి మంతనాలు సాగిస్తున్నారు. గ్రామాభివృద్ధిని కోరుకునే వారికంటే, తమకు డబ్బులు, ఇతర ప్రయోజనాలు అందించేవారికే ఓటు వేయాలనే ధోరణి పెరుగుతుండడం పల్లె రాజకీయాలను పతాకస్థాయికి చేర్చింది.

### - హోరాహోరీగా మొదటి విడత ప్రచారం

డిసెంబర్ 11న జరగనున్న మొదటి విడత ఎన్నికల కోసం బరిలో నిలిచిన అభ్యర్థులు తమ విజయానికి శాయశక్తులా కృషి చేస్తున్నారు. సర్పంచి, వార్డు సభ్యుల స్థానాల కోసం ద్విముఖ, త్రిముఖ పోరు నెలకొన్న ప్రాంతాల్లో అభ్యర్థులు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మూడు విడతలుగా జరుగుతున్న ఈ ఎన్నికల్లో తొలి విడత పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్నది. ఈ నెల 11న మొదటి విడత పోలింగ్ జరుగనున్నది. దీంతో పల్లె రాజకీయాలు రసవత్తరంగా మారాయి. మొదటి విడత ప్రచారం హైపిచ్‌లో ఉండగా, రెండో విడత నామినేషన్ల ప్రక్రియలో భాగంగా, శనివారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు దీంతో. దీంతో విడతలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమకు ప్రత్యర్థులను బుజ్జగించే పనిలో ఉన్నారు. మూడో విడత నామినేషన్ల పర్వం వేగం అందుకుంది. ఆదివారంతో మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గడువు ముగియనుంది. నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఈనెల 9వ తేదీ. ఈ దఫా ఎన్నికలకు 17న పోలింగ్ జరుగనుంది.

### - సోషల్ మీడియా వేదికగా

పంచాయతీ ఎన్నికల పోరులో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. సాధారణ ఎన్నికలకు ఏ మాత్రం తగ్గకుండా అభ్యర్థులు, వారి మద్దతుదారులు సోషల్ మీడియా వేదికగా వినూత్న ప్రచారం చేస్తున్నారు. వాట్సాప్‌లో వార్డులు, కులాలు, యువత, మహిళలు, పెన్షన్‌దారులు వంటి వర్గాల వారీగా గ్రూపులను ఏర్పాటు చేసి, ప్రతి ఒక్కరినీ ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఫేస్‌బుక్ అకౌంట్లు తెరిచి, తమ హామీలను, ప్రత్యర్థులపై విమర్శలను గుప్పిస్తున్నారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీచేస్తున్న అభ్యర్థులు తమను గెలిపిస్తే గ్రామానికి చేసే పనులను హామీల రూపంలో వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు. తమకు అనుకూలంగా ముద్రించుకున్న కరపత్రాలు, పోస్టర్లను, అలాగే గ్రామీణులను ఆకర్షించేలా పాడించుకున్న పాటలను ఆడియో, వీడియో రికార్డుల ద్వారా నేరుగా ఓటర్లకు చేరవేస్తున్నారు. తమ పార్టీ గ్రామానికి చేసిన పనులు, అభివృద్ధి కార్యక్రమాలు, గెలిస్తే జరగబోయే అభివృద్ధిని వివరిస్తూ పార్టీల వారీగా గ్రూపులు క్రియేట్ చేసి ప్రచారం చేస్తున్నారు. తమకు మద్దతివ్వాలని వేడుకోలు, విజ్ఞప్తుల రూపంలో ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

### - అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధం

ప్రధాన పార్టీల మద్దతు ఆశించి భంగపడిన రెబల్ అభ్యర్థులు పార్టీలు, నాయకులకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. వాటిని ఖండిస్తూ మద్దతుదారులు ఎదురు పోస్టులు పెడుతుండడంతో వాట్సాప్‌లో యుద్ధ వాతావరణం నెలకొంది. నిరుద్యోగులు ఉద్యోగాలు రావడంలేదని, రిటైర్డు ఉద్యోగులు పెన్షన్ బెనిఫిట్స్ అందడంలేదని పోస్టులు పెడుతున్నారు. మరికొందరు కాంగ్రెస్ పార్టీ గతంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరుతూ పోస్టులు పెడుతున్నారు. దీంతో పల్లె పోరు కాస్తా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల తీరును తలపిస్తున్నది. యువత, విద్యార్థులు సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేస్తూ, ఓటు హక్కు వినియోగంపై చైతన్యం నింపుతున్నారు.

# ఏసీబీ వలలో అడిషనల్ కలెక్టర్

- మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా..
- రూ.60 వేల లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్
- ఓ ప్రైవేట్ స్కూలు రెన్యువల్ కోసం లంచం డిమాండ్



అక్షరదర్బార్, హనుమకొండ :అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ లో దాడి జరిపారు. ఒక ప్రైవేటు స్కూల్ కరస్పాండెంట్ నుంచి లంచం తీసుకుంటుండగా విద్యాశాఖ హనుమకొండ జిల్లా అధికారి(డీఈవో)గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్ రెడ్డితో పాటు మరో ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి హనుమకొండ జిల్లా డీఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య కథనం ప్రకారం.. హనుమకొండలోని కొత్తూరు జెండాకు చెందిన ఒక ప్రైవేటు స్కూలు కరస్పాండెంట్ గత నెలలో తన పాఠశాల రెన్యువల్ కోసం హనుమకొండ డీఈఓ ఆఫీసులో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేశారు. ఈ అప్లికేషన్ పరిశీలించిన హనుమకొండ ఎంఈఓ ఆఫీసులో సబ్మిట్ చేశారు. అయినా పర్మిషన్ రాకపోవడంతో స్కూలు కరస్పాండెంట్ కొద్దిరోజుల క్రితం హనుమకొండ డీఈఓ ఆఫీసుకు వెళ్లి సంబంధిత సెక్షన్ క్లర్కులైన గౌస్, మనోజ్ ను కలిశారు. ఈ ఫైల్ క్లియర్ చేయాలంటే ఇన్చార్జి డీఈఓ అయిన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి రూ.లక్ష లంచం అడుగుతున్నాడని వారు స్కూలు కరస్పాండెంట్ కూ చెప్పారు. రూ.లక్ష ఇస్తేనే ఈ ఫైల్ క్లియర్ అయితదని అన్నారు. అయితే తాను అన్ని డబ్బులు ఇచ్చుకోలేనని, ఇన్చార్జి డీఈవో, అడిషనల్ కలెక్టర్ ను కలుస్తానని స్కూల్ కరస్పాండెంట్ చెప్పారు. ఈ మేరకు స్కూల్ కరస్పాండెంట్ ఇన్చార్జి డీఈఓ ఆయిన అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డిని కలిశారు. తన ఫైల్ క్లియరెన్స్ కోసం రూ.లక్ష లంచం అడుగుతున్నారని, మీరు చెప్తే తగ్గుతుందేమో అని కోరారు. సరే నేను వారితో మాట్లాడి చెప్తానని ఇన్చార్జి డీఈఓ, అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అయినా స్పందన లేకపోవడంతో స్కూల్ కరస్పాండెంట్ మరోసారి ఇంచార్జి డీఈవో, అడిషనల్ కలెక్టర్ ను కలిశారు ఆ సమయంలో అడిషనల్ కలెక్టర్ వద్ద ఉన్న క్లర్క్ గౌస్ తాను సార్ తో మాట్లాడతాను మీరు బయట ఉండండని చెప్పారు. అయితే సార్ తో మాట్లాడాను.. ఫైనల్ గా రూ.60,000 ఇవ్వమన్నారని క్లర్క్ గౌస్ స్కూల్ కరస్పాండెంట్ కు చెప్పారు. దీంతో తాను అంతగా ఇచ్చుకోలేనని ఇంకోసారి స్కూల్ కరస్పాండెంట్ ఇన్చార్జి డీఈఓ, అదనపు కలెక్టర్ వెంకటరెడ్డిని కలువగా మీరు వెళ్లి వాళ్ళని కలవండి నేను చెప్తాను తగ్గించి ఇవ్వండి మీ పని చేసి పెడతారని ఇంచార్జి డీఈఓ, అదనపు కలెక్టర్ స్కూల్ కరస్పాండెంట్ కు చెప్పారు. ఈ క్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శుక్రవారం కలెక్టరేట్ కు చేరుకున్నారు. ఆ సమయంలో క్లర్క్ గౌస్ లేకపోవడంతో మరో క్లర్క్ మనోజ్ ను కలిశారు. ఆయన సూచన మేరకు కలెక్టరేట్ వెనకాల సీసీ కెమెరాలు పనిచేయని ప్రదేశంలో స్కూల్ కరస్పాండెంట్ నుంచి మనోజ్ రూ.60,000 లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ కేసులో ఇన్చార్జి డీఈఓ, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డితో పాటు క్లర్కులు గౌస్, మనోజ్ ను కస్టడీలోకి తీసుకున్నామని, శనివారం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య మీడియాకు వెల్లడించారు. ఈ దాడిలో డీఎస్పీ సాంబయ్యతో పాటు ఏసీబీ ఇన్ స్పెక్టర్లు ఎల్ రాజు, ఎస్ రాజు, ఖమ్మం ఇన్ స్పెక్టర్లు పాల్గొన్నారు. ఏసీబీకి పట్టుబడిన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి జనగామ ఆర్డీవోగా పని చేసిన సమయంలో అవుటర్ రింగ్ రోడ్డు కోసం జరిగిన భూసేకరణలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై విచారణ జరిగినట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. అలాగే వెంకటరెడ్డి నల్గొండలో పనిచేసిన సమయంలో 2008లో ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని కేసు బుక్ అయినట్లు ఆయన చెప్పారు. పక్కా ప్రణాళికతో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డితో పాటు మరో ఇద్దరు ఉద్యోగులను వల పన్ని లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం సంచలనం కలిగించింది. ప్రధానంగా ఒక అడిషనల్ కలెక్టర్ లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కడం కలకలం రేపింది.


హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్ రెడ్డి







# సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు శివకుమార్ నాయుడు
- మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల విధుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం

అక్షరదర్బార్, హనుమకొండ: ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర ఎంతో కీలకమని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు శివకుమార్ నాయుడు అన్నారు. పంచాయతీ ఎలక్షన్స్ లో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హనంకొండ జిల్లా సాధారణ పరిశీలకులు సీనియర్ ఐఏఎస్ అధికారి శివకుమార్ నాయుడు మాట్లాడుతూ సాధారణ పరిశీలకులు ఎలక్షన్ కమిషన్కు కన్నుల వంటి వారు అని, వీరి ద్వారానే ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రక్రియను చూస్తుందని తెలిపారు. సాధారణ పరిశీలకులు సూక్ష్మ పరిశీలకుల ద్వారానే ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తారని తెలిపారు. అందువల్ల సూక్ష్మ పరిశీలకులు ఎన్నికల రోజు తగు జాగ్రత్తలతో ఉండి, ఎన్నికల ప్రక్రియలో జరిగే ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరుగేలా పరిశీలించాలని, వాటికి సంబంధించిన రిపోర్టులను తయారు చేయాలని, అదేవిధంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమం, ఉపసర్పంచ్ ఎన్నిక మొదలగునవి ఎలక్షన్ కమిషన్ నిబంధన ప్రకారం జరిగేలా పరిశీలించాలని, వాటికి తగు నివేదికలను సాధారణ పరిశీలకులకు అందించాలని, ఒకవేళ ఎక్కడైనా ఎన్నికల ప్రక్రియలో నిబంధనలను పాటించకపోవడం లేదా ఏవైనా అవాంతరాలు ఏర్పడినట్లయితే అట్టి విషయాన్ని వెంటనే సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. హనుమకొండ జిల్లాలో మొత్తం 58 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి, 70 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించడమైనదని తెలిపారు. వీరు మూడు దశలలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో తమ తమ విధులను నిర్వర్తించి సరిగా రిపోర్టులను అందజేయాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎన్నికల అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా పరిషత్ సీఈవో రవి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహేందర్, మాస్టర్ ట్రైనర్స్ సుధాకర్ రెడ్డి, రవి, శ్రీనివాస్ స్వామి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సౌకర్యాల విస్తరణకు ప్రైవేట్ బిల్లులు

- లోక్ సభలో ప్రవేశపెట్టిన వరంగల్ ఎంపీ డా కడియం కావ్య



అక్షరదర్బార్, వరంగల్: మహిళల రక్షణ, సౌకర్యాలు, సామాజిక భద్రతను బలోపేతం చేసే దిశగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో రెండు కీలక ప్రైవేట్ బిల్లులను ప్రవేశపెట్టారు. మూడు దశాబ్దాల తర్వాత తెలంగాణ నుంచి ఒక మహిళా ఎంపీ ఇలాంటి ప్రత్యేక బిల్లులను ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఉద్యోగ రంగంలో నెలసరి సమయంలో మహిళలకు అవసరమైన సౌకర్యాలు, అందుబాటు గదులు, శుభ్రమైన రెస్ట్‌రూములు, తగిన ఆరోగ్య వసతులు కల్పించేందుకు చట్టపరమైన నిబంధనలు తప్పనిసరి చేయాలని మొదటి బిల్లులో డా కావ్య ప్రతిపాదించారు. మహిళల ఆరోగ్యం, ఉద్యోగ ఉత్పాదకత, భద్రత దృష్ట్యా ఈ చర్య అత్యంత కీలకమని ఆమె స్పష్టం చేశారు. ఇక రెండో ప్రైవేట్ బిల్లులో ఒంటరి మహిళలు, వితంతువులు, ఆపన్నస్థితిలో ఉన్న స్త్రీలకు ప్రభుత్వంచే అత్యవసర సహాయం, ఆధార వేతనాలు, గృహ భద్రత, సామాజిక సంక్షేమ చర్యలు తక్షణం అందేలా ప్రత్యేక విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. ఈ రెండు బిల్లులను లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోదించగా, మహిళా సాధికారత దిశగా ఇది మరొక ముఖ్యమైన అడుగుగా నిలిచింది. వరంగల్ ఎంపీ ప్రవేశపెట్టిన ఈ బిల్లులు దేశవ్యాప్తంగా మహిళా సంక్షేమానికి మార్గదర్శకంగా ఉండనున్నాయని మహిళ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915